అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేయండి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలోని శిశు సంరక్షణ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు అవసరమైన సర్టిఫికెట్లు త్వరగా జారీ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఆరు కేంద్రాలు, ఎన్‌జీవోల ఆధ్వర్యంలో ఉన్న 44 కేంద్రాల్లో మొత్తం 4000 పైగా పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరిలో చాలా మందికి జనన, కుల, ఆధార్, సదరం, అర్బన్ వంటి సర్టిఫికెట్లు లేవన్నారు. ఈ సర్టిఫికెట్ల జారీ కోసం ఈ నెల 22 నుంచి 27 వరకు ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, ఆర్డీవోలు సూర్యప్రకాశ్, రవికుమార్, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, జిల్లా వైద్య రోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, బీసీహెచ్‌ఎస్ డాక్టర్ సునీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి మీదుగా మెట్రో మార్గం కష్టం

- నానక్‌రామ్‌గూడ మీదుగా సులభం
- కొత్త ప్రతిపాదనలపై మెట్రో అధికారుల కసరత్తు
- రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు మెట్రో అనుసంధానంపై దృష్టి

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): కొత్తగా ప్రతిపాదించిన మెట్రో మార్గాలపై క్షేత్ర స్థాయిలో మెట్రో అధికారులు సర్వే పనులు మొదలు పెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు రెండో దశలో భాగంగా మొత్తం 5 మార్గాల్లో 76 కి.మీ మేర నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందులో రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రతిపాదించిన 12 కి.మీ మార్గంలో బయోడైవర్సిటీ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, ఐఎస్‌బీ రోడ్డు, విప్రో లేక్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్) వరకు కొత్తగా మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో అధికారులు కన్సల్టెంట్లతో కలిసి రోడ్డు మార్గంలో రూట్ మ్యాప్‌లను పరిశీలించారు. బయోడైవర్సిటీ జంక్షన్ తర్వాత గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ చౌరస్తా మీదుగా ట్రిపుల్ ఐటీ వరకు నిర్మించే మార్గంలో చాలా అడ్డంకులు ఉన్నాయని ప్రాథమికంగా గుర్తించారు. ముఖ్యంగా గచ్చిబౌలి జంక్షన్‌లో ఇప్పటికే 3 అంతస్థుల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలు ఉన్నాయి. వీటి మీదుగా మెట్రో మార్గాన్ని నిర్మించాలంటే ఎత్తుతో పాటు నిర్మాణ వ్యయం పెరిగి, పనులు చేపట్టడం సంక్లిష్టంగా మారుతుంది. ప్రత్యేకంగా భూసేకరణ చేయాల్సి ఉంటుంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన రాయదుర్గం-ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టులో ప్రతిపాదించిన కొంత మార్గాన్ని ప్రత్యామ్నాయంగా తీసుకోవాలని నిర్ణయించారు.

అనుకూలంగా గత ప్రభుత్వ ప్రతిపాదిత మార్గం...

ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ మార్గాన్ని 31 కి.మీ మేర నిర్మించాలని నిర్ణయించి, దానికి అనుగుణంగానే రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి క్షేత్ర స్థాయిలో భూములను సైతం సేకరించారు. అంతలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఎయిర్‌పోర్టు మెట్రో మార్గాన్ని పక్కన పెట్టి, కొత్తగా 5 మార్గాలను ప్రతిపాదించి వాటిపై అధ్యయనం చేయాలని మెట్రో అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రతిపాదించిన 12 కి.మీ మార్గంలో గచ్చిబౌలి మీదుగా కాకుండా.. గత కేసీఆర్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మార్గంలో నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్ ఇంటర్‌చేంజ్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు మెట్రో మార్గాన్ని నిర్మించడానికి అనుకూలంగా ఉందని మెట్రో అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రాయదుర్గం వద్ద ప్రారంభమయ్యే మెట్రో లైను బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద ఎలాంటి వంపులు లేకుండా నేరుగా ఖాజాగూడ చెరువు వైపు ఉన్న రోడా మిస్ట్రీ కాలేజ్ ఆఫ్ సోషల్ వర్క్ అండ్ రీసెర్చ్ సెంటర్ మీదుగా నానక్‌రాంగూడ వెళ్లే రోడ్డుకు అనుసంధానం చేయడం ద్వారా.. తక్కువ వ్యయంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా మెట్రో నిర్మాణం పనులు చేపట్టేందుకు అనుకూలమైన మార్గంగా ఉందని మెట్రో అధికారులు తెలిపారు. ఈ ప్రతిపాదనతో ఉన్న సానుకూల అంశాలతో ఒక నివేదికను మెట్రో అధికారులు రూపొందించి సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

ఖాజాగూడలో 8 ఎకరాల భూసేకరణ..

గత కేసీఆర్ ప్రభుత్వం రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కి.మీ మేర ప్రతిపాదించిన మార్గంలో భూసేకరణ పనులు సైతం చేపట్టింది. బయోడైవర్సిటీ చౌరస్తా దాటిన తర్వాత ఉన్న ఖాజాగూడ పరిధిలో సుమారు 8 ఎకరాల భూమిని మెట్రో ప్రాజెక్టు కోసం గత కేసీఆర్ ప్రభుత్వమే కేటాయించింది. అందులో భూమిని చదును చేయడంతో పాటు ప్రాథమికంగా మార్కింగ్ పనులు చేపట్టింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు నిర్మించే మెట్రో మార్గాన్ని త్వరగా పూర్తి చేయడంతో పాటు తక్కువ వ్యయంతో నిర్మించవచ్చని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో మార్గంలో ఇప్పటికే ఖాజాగూడ-నానక్‌రాంగూడ రోడ్డు మెట్రో నిర్మాణానికి అనువుగా ఉండటంతో పాటు భూసార పరీక్షలను కూడా నిర్వహించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు అవసరమైన అన్ని రకాల అధ్యయనం, నిర్మాణం చేపట్టడానికి చర్యలను అధికారులు పూర్తి చేశారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయండి

మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న చాడ వెంకటరెడ్డి

హిమాయత్‌నగర్,జనవరి19: రాష్ట్ర వ్యాప్తం గా టూరిజం సంస్థలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం సచివాలయంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ టూరిజం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీఎస్. బోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బురాజమౌళి కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో జ్యోతి, రచన, హైమావతి, రమేశ్, రంజిత్, ఇక్బాల్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం పద్మారావు నగర్‌లోని స్కందగిరి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాన్ని సందర్శించారు. నగర పర్యటనకు వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారిని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

- బన్సీలాల్‌పేట్, జనవరి 19

రూ.20 వేల కోట్లు కేటాయించాలి



డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ, జనవరి 19: వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని, విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను కలిసి వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లకు పెంచాలని ఆర్.కృష్ణయ్య తన బృందంతో కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బీసీల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య తెలిపారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో జాతీయ కన్వీనర్ కృష్ణ, నీల వెంకటేశ్, శ్రీనివాస్, సుధాకర్, మధుసూదన్, రామకృష్ణ, రాజేందర్, పృథ్వీగౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధి చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

న్యాక్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి

మాదాపూర్, జనవరి 19: స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 2 లక్షల మంది యువతకు శిక్షణ నిచ్చి, ప్లేస్‌మెంట్ కల్పించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని న్యాక్‌ను మంత్రి శుక్రవారం సందర్శించారు. న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శాంతి శ్రీ, సీఎస్ శాంతికుమారితో కలిసి న్యాక్ డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మండలం, జిల్లా స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో స్కూల్స్ పెడతామన్నారు. మహబూబ్‌నగర్, నల్లొండ జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ట్రయల్‌గా మొదలు పెడతామని పేర్కొన్నారు.

భారత్, ఇంగ్లాండ్ టెస్టుకు ముమ్మర ఏర్పాట్లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.శుక్రవారం స్టేడియంలో గణపతి ఆలయం, ప్రధాన పిచ్ వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మొదటి టెస్టు మ్యాచ్‌కు క్రికెట్ అభిమానుల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదని, 20వేల టికెట్లు ఆన్‌లైన్‌లో అమ్ముడయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవరాజ్, ఉపాధ్యక్షుడు దల్జిత్‌సింగ్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ యూబీడీ అదనపు కమిషనర్ బదిలీ

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో అర్బన్ బయోడైవర్సిటీ(యుబిడి) అదనపు కమిషనర్ వి.కృష్ణ శుక్రవారం మాతృసంస్థకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఎవరికి పోస్టింగ్ ఖరారు చేయలేదు. కాగా వి.కృష్ణ సుదీర్ఘ కాలం పాటు డిప్యుటేషన్‌పై వచ్చి అర్బన్ బయోడైవర్సిటీలో తనదైన ముద్ర వేశారు. మహానగరం పచ్చదనం పెంపు, థీమ్ పార్కులు, ప్లాంటేషన్, వర్టికల్ గార్డెన్, ట్రీ సిటీ అవార్డు దక్కడంలో ఆయన తనదైన పాత్ర పోషించారు.

హెపటైటిస్-ఏ నివారణకు.. 'హావిష్యూర్' వ్యాక్సిన్

జూబ్లీహిల్స్, జనవరి 19: ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ హెపటైటిస్-ఏ నివారణకు 'హావిష్యూర్' వ్యాక్సిన్‌ను శుక్రవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా, ఎమ్మెల్యే నాగరాజ్ కర్పన్, ఐఐఎల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియబ్రత పట్నాయక్, ఎండీ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్, హ్యూమన్ హెల్త్ బిజినెస్ వీపీ షకుల్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలు

పటాన్‌చెరు, జనవరి 19: పటాన్‌చెరు మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేనా మార్లిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో మొత్తం 80 సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tmreis.telangana.gov.in ద్వారా కాని లేదా నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని, ఎటువంటి ప్రవేశ ఫీజు లేదని తెలిపారు. చివరి తేదీ ఫిబ్రవరి 6 వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

మల్లన్న జాతరకు వేళాయే..



ఆలయంలో కొలువైన మల్లికార్జున స్వామి , విద్యుత్ దీపాల వెలుగులో మల్లన్న ఆలయం

చేర్యాల, జనవరి 19 : కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 21న నిర్వహించే పట్నం వారంతో ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో బ్రహ్మోత్సవాల సమయంలో 12 ఆదివారాలతో పాటు, ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లతో పాటు నీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఏ.బాలాజీ, చైర్మన్ లక్ష్మారెడ్డి తెలిపారు. అలాగే పట్నం వారం సందర్భంగా ఆదివారం అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు.

నార్సింగిలో పశు సంక్రాంతి

నార్సింగి పశుసంకాంత్రిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రజాప్రతినిధులు

మణికొండ, జనవరి 19 : ప్రతిఏటా సంక్రాంతి పండుగ తర్వాత రెండో శుక్రవారం పశుసంక్రాంతిని ఘనంగా నిర్వహిస్తారు. నార్సింగి మున్సిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన పశుసంక్రాంతికి మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పశువులను వ్యాపారులు కొనుగోలు చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పశుసంక్రాంతిలో పాల్గొని పశువుల ధరలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, శంషాబాద్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్లు సుష్మారెడ్డి, రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్, వెంకటేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ మల్లేశ్, పార్టీ అధ్యక్షుడు నర్సింహ, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 19 : సైబర్ సెక్యూరిటీ రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని విద్యార్థులకు అందించాలని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో వల్నరబిలిటీ అస్సెస్‌మెంట్ అండ్ పెనెట్రేషన్ టెస్టింగ్ అన్న అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ , రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ సంస్థ కో ఆర్డినేటర్ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి కాలంలో యుద్ధాలు సైనికులతో కాకుండా సైబర్ దాడులతో జరుగుతున్నాయని, ఈ దాడులను అరికట్టడానికి సైబర్ సెక్యూరిటీ చాలా అవసరమన్నారు. సైబర్ సెక్యూరిటీ పై నిపుణులు మనీశ్ దోమల, జయకృష్ణ శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన 44మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో అరుదైన చికిత్స

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): లక్షల మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ గర్భిణికి నిలోఫర్ వైద్యులు విజయవంతంగా సాధారణ ప్రసవం చేశారు. సంగారెడ్డి జిల్లా, ముగ్దంపల్లికి చెందిన సంజీవ్‌రాథోడ్ భార్య సెవంతాబాయి(31) పుట్టుకతో 'వాన్ విల్లీ బ్రాండ్ డిజార్డర్' టైప్-3తో బాధపడుతోంది. ఈ రుగ్మత వల్ల రక్తం గడ్డకట్టే గుణం కోల్పోతుంది. ఫలితంగా రోగులకు తీవ్ర రక్త స్రావం జరిగి, ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంటుందని నిలోఫర్ దవాఖాన సూపరింటెండెంట్ డా.ఉషారాణి చెప్పారు. అయితే సెవంతాబాయి కేసును చాలెంజ్‌గా తీసుకుని ఆమె గర్భం దాల్చిన ప్రారంభం నుంచే చికిత్సతో పాటు ఎప్పటికప్పుడు ఆరోగ్యపరిస్థితిని వైద్యులు పర్యవేక్షించారు. వైద్యబృందం రోగికి ఈనెల 13న ప్రసవం చేశాయని వివరించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఉషారాణి వైద్యబృందాన్ని అభినందించారు.

ఎంఎంటీఎస్ రైళ్లు పాక్షికంగా రద్దు..

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, సికింద్రాబాద్ సబర్బన్‌కు సంబంధించిన ఎంఎంటీఎస్ లోకల్ రైలు సర్వీసులను పాక్షికంగా రద్దు చేస్తూ శుక్రవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. లింగంపల్లి-ఫలక్‌నుమా, ఉమ్దానగర్ స్టేషన్ల మధ్య, సికింద్రాబాద్-ఫలక్‌నుమా, సికింద్రాబాద్-ఉమ్దానగర్ స్టేషన్ల మధ్య నడిచే రైళ్లను పాక్షికంగా ఈ నెల 20 నుంచి 25 వరకు టైమ్‌టేబుల్ వారీగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సీతాఫల్‌మండి-కాచిగూడ రైల్వే స్టేషన్ మధ్య ట్రాఫిక్ బ్లాక్ వల్ల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఈ నెల 20, 21, 22 తేదీల్లో కాచిగూడ మీదుగా వెళ్లాల్సిన మూడు రైళ్లను కాజీపేట్, మౌలాలి, సికింద్రాబాద్, గుంతకల్, ధర్మవరం మీదుగా వెళ్లే విధంగా దారి మళ్లించామని తెలిపారు.

వివేకానంద సిద్ధాంతాలను అధ్యయనం చేయాలి

నేషనల్ యూత్ అవార్డులు, స్వామి వివేకానంద సేవా పురస్కార గ్రహీతలతో ప్రముఖులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 19: స్వామి వివేకానంద బోధించిన సిద్ధాంతాలను యువత అధ్యయనం చూసి ఆచరణలో పెట్టాలని వక్తలు సూచించారు. నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలు బొగ్గులకుంట తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి నేషనల్ యూత్ అవార్డులు, స్వామి వివేకానంద సేవా పురస్కారాలను ప్రదానం చేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ దయానంద్, మాజీ మంత్రి బాబూమోహన్, తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు హేమంత్, కె.భాస్కర్ గుప్త, డాక్టర్ ఎస్.ఎం హూస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌పై హెచ్‌సీజీ బృందం అవగాహన

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ క్యాంపస్‌లో జరుగుతున్న నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్-2024లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు హైదరాబాద్ సైక్లిస్ట్సు గ్రూప్ బృందం శుక్రవారం 'పర్యావరణ పరిరక్షణ-సైక్లింగ్ వినియోగానికి ప్రోత్సాహం' అనే అంశంపై అవగాహన కల్పించింది. సైక్లింగ్ వినియోగం పెరగడం కోసం హెచ్‌సీజీ చేస్తున్న కార్యక్రమాలను బృందం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీజీ ఫౌండర్ నందనూరి రవీందర్, బీమ్‌సింగ్, ప్రవీన్ గాడిల, యాదవ్ బాల్‌రాజ్, శశికళ, కె.కిరణ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడికి మరణ శిక్ష

దర్యాప్తు అధికారులను అభినందించిన నగర సీపీ

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడు ఇమ్రాన్ ఉల్ హాక్‌కు మరణ శిక్ష విధించడంతో ఈ కేసు దర్యాప్తులో పాలు పంచుకున్న సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. సీపీ నుంచి అభినందనలు అందుకున్న వారిలో సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్య, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. శ్రీవాణి, గోల్కొండ, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.వెంకటేశ్వర్లు, ఎం.రవీందర్ తదితర సిబ్బంది ఉన్నారు.

పరిశోధనలు మరింత పెరగాలి

ఒప్పందం పత్రాలను మార్చుకుంటున్న కెఎల్‌యు, పీజేటీఎస్‌ఎయూ

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 19 : దేశవ్యాప్తంగా సాగులో మంచి ఫలితాలు పొందాలంటే, ప్రభుత్వ ,ప్రైవేటు మరిన్ని సంస్థల ఒప్పందాలు అవసరమని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.ఎం.వెంకట రమణ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్సిటీ (కెఎల్‌యు) ప్రతినిధి డా.రామకృష్ణతో, పీజేటీఎస్‌ఎయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పీజీ, పీహెచ్‌డీ కోర్సుల బోధన, పరిశోధనలో సహకారం, విద్యార్థులు, ఫ్యాకల్టీల పరస్పర మార్పిడికి , రెండు విశ్వవిద్యాలయాలు ప్రాథమికంగా 6 అంశాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. గుజరాత్‌కు చెందిన జేఆర్‌ఎమ్ ఎక్స్‌పోర్టుతోను ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ సోనా అమ్మడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. తెలంగాణ సోనాకి అంతర్జాతీయ ఆదరణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డా.రఘురామిరెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు డా. సీమ, డా.సుధారాణి, డా.శ్రీధర్ అనిత, జమునా రాణి, గ్రంథ పాలకులు డా.ఎంపీ రవికుమార్, కెఎల్‌యు ప్రతినిధులు, జెఆర్‌ఎమ్ ప్రతినిధి హిలాని తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగం భారతావనికే విశ్వగురువు

బాలానగర్, జనవరి 19 : భారతావనికి ఫార్మా రంగం విశ్వగురువుగా అవతరించిందని ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ అరుణీశ్ చావ్లా పేర్కొన్నారు. శుక్రవారం బాలానగర్ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైఫర్)లో నైఫర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శైలేంద్ర శరఫ్ అధ్యక్షతన నిర్వహించిన 11వ స్నాతకోత్సవానికి అరుణీశ్ చావ్లా, నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ చావా హాజరయ్యారు.ఈ సందర్భంగా నైఫర్‌లో వివిధ రకాల ఫార్మా విద్యను అభ్యసించిన 192 మంది, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 11 మందికి బంగారు పతకాల